శనివారం 10-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1 సంచిక: 420 పేజీలు: | ₹6


EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com




బ్యాంకు ఖాతాలకు నలుగురు నామినీలు

మిగతా 2లో



రాజకీయాల్లోకి వస్తాను..

మిగతా 3లో



అమ్మాయిలు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ లేదా?

మిగతా 3లో



సింగిల్ అని ఎప్పుడైనా చెప్పానా?

మిగతా 5లో

## విద్యార్థుల జీవితాలను ప్రమాదంలో నెట్టాలా నీట్ పరీక్ష

పరీక్ష వాయిదాను తిరస్కరించిన సుప్రీంకోర్టు

# ఏలా వాయిదా వేయగలం..




ముందడుగు ఢిల్లీ

నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసి విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఈ తీర్పుతో షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 11న (ఆదివారం) ఈ పరీక్ష జరగనుంది. "ఇలాంటి పరీక్షలను ఎలా వాయిదా వేయగలం? ఈ మధ్యకాలంలో పరీక్ష వాయిదా వేయాలంటూ పలు పిటిషన్లు వస్తున్నాయి. ఇది పూర్తి పరిపూర్ణమైన ప్రపంచమేమీ కాదు. మేం విద్యావేత్తలం కాదు. ప్రాథమిక అంశాల ఆధారంగా.. మేం పరీక్ష తేదీని రీషెడ్యూల్ చేయలేం. దీనిగురించి రెండు లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఆ విద్యార్థుల జీవితాలను మేం ప్రమాదంలో పడవేయలేం. ఈ పిటిషన్ల వెనుక ఎవరున్నారో తెలీదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. పరీక్ష వాయిదా కోరుతూ పిటిషన్లు వేసిన వారి తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే వాదనలు వినిపించారు. గత ఏడేళ్లుగా నీట్ పీజీ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహిస్తోంది. ఇప్పటివరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. అయితే, నీట్-యూజీ 2024 పరీక్షపై దేశ వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమవడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను సైతం కేంద్రం వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా 185 నగరాల్లో ఆగస్టు 11న కంప్యూటర్ ఆధారిత విధానంలో రెండు షిప్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఆధారంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

# అదరగొట్టిన అమన్



రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి పతకం

ముందడుగు జాతీయం

రెజ్లింగ్‌లో వినేశ్ ఫొగాట్‌కు పతకం దక్కినట్లే దక్కి చేజారింది. ఆ నిర్వేదంలో ఈసారి భారత్‌కు కుస్తీ పోటీల్లో ఒక్క పతకమైనా రాకపోతుందా అని క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే ఈ ఆశలు నెరవేరలేదు. భారత కుస్తీ వీరులు అంచనాలను అందుకోలేకపోయారు. మరో రెండు రోజుల్లో విశ్వ క్రీడలకు తెరపడుతుందనగా.. రెజ్లర్ అమన్ సెహ్రావత్ సత్తా చాటాడు. విశ్వక్రీడల్లో సంచలన ప్రదర్శనతో మెరిశాడు. ఫైనల్ కు చేరడంలో విఫలమైన అమన్.. కాంస్య పతకపోరులో అద్భుత విజయాన్ని అందుకుని భారత్‌కు ఆరో పతకం అందించాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ బౌట్ లో అమన్ సెరావత్ 13-5 పాయింట్లతో ప్యూర్టోరికాకు చెందిన డేరియన్ క్రూజ్‌పై ఏకపక్ష విజయం సాధించాడు. అమన్ పతక ఆశలు నెరవేర్చడంతో భారత్ ఖాతాలో మరో కాంస్య పతకం చేరింది. ఇప్పటి వరకు పారిస్ విశ్వక్రీడల్లో భారత్ ఆరు పతకాలను సాధించింది. ఇందులో ఒక రజతం.. ఐదు కాంస్యాలు ఉన్నాయి. బౌట్ ఆరంభంలో క్రూజ్ పాయింట్ సాధించి లీడ్ లోకి వెళ్లగా... అమన్ చాలా జాగ్రత్తగా ఆడాడు. అదును చూసుకుని క్రూజ్‌పై ఆధిపత్యం చెలాయించాడు. ఆరంభంలో వ్యూహాత్మకంగా క్రూజ్‌ను మ్యాచ్‌పై నుంచి బయటకు నెట్టి పాయింట్లు స్కోర్ చేసిన అమన్.. ఆ తర్వాత మ్యాట్‌పైనే క్రూజ్‌పై పట్టు సాధించాడు. చివరి నిమిషాల్లో దూకుడు ప్రదర్శించిన అమన్ వరుసగా పాయింట్లు సాధిస్తూ భారీ ఆధిక్యంలో వెళ్లి ఏకపక్ష విజయం అందుకున్నాడు. అమన్ ధాటికి ఓ దశలో క్రూజ్ నిశ్చేష్టుడయ్యాడు. ఆ తర్వాత ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వచ్చిన అమన్ కాంస్యాన్ని సాధించాడు.

ముందడుగు
శనివారం, 10-08-2024, హైదరాబాద్



# బ్యాంకు ఖాతాలకు నలుగురు నామినీలు

## లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు

ముందడుగు జాతీయం

బ్యాంకు ఖాతాల నామినీల సంఖ్యను నలుగురి వరకు పెంచేలా మార్పులు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, 2024ను శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఒక నామినీని మాత్రమే ఎంచుకునే అవకాశం ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు డైరెక్టర్‌షిప్ హోదా కోసం ఉండాల్సిన కనీస వాటా పరిమితిని సైతం పెంచేలా సవరణ చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచనున్నట్లు సమాచారం. ఇప్పుడున్న పరిమితి దాదాపు ఆరు దశాబ్దాల క్రితం నిర్దేశించినది. ఈ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. సహకార బ్యాంకులకు సంబంధించి కూడా బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లులో కీలక మార్పులు ప్రతిపాదించినట్లు సమాచారం. చట్టబద్ధ ఆడిటర్లకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిర్ణయించుకునే స్వాతంత్ర్యాన్ని పూర్తిగా బ్యాంకులకే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాంకుల రిపోర్టింగ్ తేదీలను రెండు, నాలుగో శుక్రవారాల నుంచి ప్రతినెలా 15, చివరి తేదీలకు మారుస్తూ సవరణ చేసినట్లు సమాచారం. ఈ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ గత శుక్రవారమే ఆమోదం తెలిపింది.

# కవిత జైల్లో 11కిలోల తగ్గారు..

- వచ్చే వారం కవితకు బెయిల్ రావొచ్చు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




ముందడుగు ఢిల్లీ

ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. పలు మార్లు బెయిల్ కోసం ప్రయత్నం చేసినా ఇప్పటి వరకు లభించలేదు. తాజాగా ఆప్ నేత సిసోడియా కు సుప్రీంకోర్టు కండీషన్లతో కూడిన బెయిల్ మంజూరు చేసారు. ఇదే సమయంలో కవిత బెయిల్ కోసం కేసీఆర్ కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. కవిత ఆరోగ్య పరిస్థితి..బెయిల్ పైన సోదరుడు కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన సోదరి కవిత జైలు జీవితం పైన ఆవేదన వ్యక్తం చేసారు. తాజాగా హరీష్ తో పాటుగా కేటీఆర్ తీహార్ జైలులో కవితను పరామర్శించారు. కవిత గురించి స్పందిస్తూ కేటీఆర్ ఉద్వేగానికి లోనయ్యారు. కవిత జైల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటి వరకు 11 కిలోలు తగ్గారని, బీపీ వచ్చిందని పేర్కొన్నారు. దాని వల్ల రోజూ రెండు టాబ్లెట్స్ వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ వివరించారు. తాజాగా జైలులో అస్వస్థతకు గురైన కవితకు చికిత్స అందించారు.

# పదేళ్లుగా అమెరికాలోనే మహిళ నివాసం

## గుజరాత్ టీచర్‌గా ప్రతి నెల జీతం స్వాహా

ముందడుగు గుజరాత్




గుజరాత్‌కు చెందిన ఒక మహిళ పదేళ్లుగా అమెరికాలో యూఎస్ గ్రీన్ కార్డుతో 2013 నుంచి చికాగో రాష్ట్రంలో శాశ్వత నివాసిగా ఉంటున్నారు. అమెరికాలో ఉన్నప్పటికీ గుజరాత్ రాష్ట్రంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయురాలిగా జీతం మాత్రం అందుకుంటున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భావనాబెన్ పటేల్ అనే మహిళ గతంలో బనస్కాంతలోని అంబాజీ నగరంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండేవారు. అయితే, 2013లో ఆమె అమెరికా వెళ్లిపోయారు. యూఎస్ గ్రీన్ కార్డుతో ప్రస్తుతం చికాగోలో శాశ్వత నివాసిగా ఉంటున్నారు. ఇప్పటికీ ఆమె పేరు పాఠశాల జాబితాలో ఉంది. అంతేకాదు, పాఠశాల ద్వారా ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ జీతం తీసుకుంటున్నారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. పటేల్ సాధారణంగా ఏడాదికి ఒకసారి దీపావళి సందర్భంగా మాత్రం గుజరాత్‌కు వెళ్తుంటారు. ఆ సమయంలో పాఠశాలకు సెలవులు ఉంటాయి. దీంతో ఆమె పాఠశాలను సందర్శించే అవకాశం కూడా లేదు. అయినప్పటికీ ఆమె ప్రభుత్వం నుంచి జీతం తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

# ఆలస్యం అయినా న్యాయమే గెలుస్తోంది

## కేజ్రీవాల్ సతీమణి సునితా కేజ్రీవాల్ స్పందన

ముందడుగు ఢిల్లీ



ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత సిసోడియాకు బెయిల్ రావడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. ఆలస్యం అయినా న్యాయమే గెలుస్తుందని అర్థం వచ్చేలా ఓ ట్వీట్ పెట్టారు. 'న్యాయం జరగడంలో కొంత ఆలస్యం కావొచ్చు. కానీ, తిరస్కరించబడదు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. మద్యం కుంభకోణం కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సిసోడియాను అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తీహార్ జైల్లోనే ఉంటున్నారు. బెయిల్ కోసం తీవ్రంగా పోరాటం చేశారు. ఈ క్రమంలో సుప్రీం తీర్పుతో 17 నెలలుగా జైలు జీవితాన్ని గడుపుతున్న సిసోడియాకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ నేపథ్యంలో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుపై ఆమ్ ఆద్మీ పార్టీ సంతోషం వ్యక్తం చేసింది. చివరికి సత్యమే గెలిచింది అంటూ ఆప్ నేతలు సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నారు.

ముందడుగు

శనివారం, 10-08-2024, హైదరాబాద్



## శ్రీశైలం దేవస్థానానికి ట్రాక్టర్ విరాళం

ముందడుగు శ్రీశైలం

ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు శ్రీశైలం శాఖ దేవస్థానానికి ట్రాక్టరును సమర్పించారు. బ్యాంకు చైర్మన్ ఎస్. సత్యప్రకాశ్ సింగ్, కడప సదరు ట్రాక్టరును కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు అందజేయడం జరిగింది. ఈ ట్రాక్టరు విలువ రూ. 12 లక్షల దాకా ఉంటుందని బ్యాంకు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా గంగాధరమండపము వద్ద ట్రాక్టరుకు వాహనపూజలను జరిపించారు. కార్యక్రమానంతరం బ్యాంకు అధికారులకు స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమములో దేవస్థానం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు వి. రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ( ఐ/సి) చంద్రశేఖరశర్మ, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు, నంద్యాల రీజనల్ మేనేజర్ పి.వి. రమణ, శ్రీశైలం శాఖ మేనేజరు కె.సుబ్రహ్మణ్యం, స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు శాఖ పూర్వపు మేనేజర్ కె.రామచంద్రశర్మ,బ్యాంకు, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీకు హాజరు వేయాలంటే కోరిక తీర్చాలి

### ఉపాధ్యాయురాలిపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

ముందడుగు ఉత్తరప్రదేశ్



పిల్లలకు పాఠాలు చెపుతూ స్ఫూర్తిగా ఉండాల్సిన ఒక ఉపాధ్యాయుడు తోటి మహిళా ఉపాధ్యాయురాలిపై లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. ఆమె హాజరు విషయాన్ని అడ్డుపెట్టుకుని ముద్దు కోసం డిమాండ్ చేశాడు. ముద్దు లేదా కోరిక తీరుస్తేనే నీ హాజరు వేస్తానని మెలికపెట్టాడు. అయితే ఆ ఉపాధ్యాయుడి వెకిలి వేషాలను బాధిత ఉపాధ్యాయురాలు వీడియో తీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ మహిళా ఉపాధ్యాయురాలు తన విధులకు సంబంధించిన హాజరు శాతం విషయమై తోటి ఉపాధ్యాయుడి దగ్గరికి వెళ్లింది. తన హాజరుకు ఆమోదం తెలపాలని కోరింది. దాంతో 'నీ హాజరు వేయాలంటే నాది ఒక షరతు ఉంది. అది చాలా సరదాగా ఉంటుంది. చాలా సులువుగా పని అవుతుంది' అని ఉపాధ్యాయుడు వ్యాఖ్యానించాడు. 'ఏమిటా షరతు..?' అని ఉపాధ్యాయురాలు అడుగగా ఆ ఉపాధ్యాయుడు సిగ్గు పడుతూ, మురిసిపోతూ తన బుగ్గను చూపిస్తూ 'ముద్దు కావాలి' అని చెప్పాడు. అందుకు మహిళా టీచర్ నిరాకరించింది.

## అమ్మాయిలు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ లేదా?

### హిజాబ్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ముందడుగు ఢిల్లీ



మహారాష్ట్రలోని ఓ కాలేజీ క్యాంపస్‌లో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ ఇచ్చిన సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల పేర్లతో వారి మతపరమైన గుర్తింపు బయటపడట్లేదా? అని ప్రశ్నించింది. అమ్మాయిలకు తాము ధరించే దుస్తులను ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయపడింది. క్యాంపస్‌లో హిజాబ్, బుర్కా, నిఖాబ్, క్యాప్ వంటివి ధరించకూడదంటూ ముంబయిలోని ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠీ కాలేజీ ఇటీవల ఓ సర్క్యులర్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ కొన్ని విద్యార్థి సంఘాలు బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. కళాశాల నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. నిషేధంపై స్టే విధించింది. "అమ్మాయిలకు వారు ధరించే దుస్తులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండాలి. కాలేజీలు వారిని బలవంతం చేయకూడదు. దేశంలో అనేక మతాలు ఉన్నాయి. విద్యార్థుల పేర్లు వారి మతపరమైన గుర్తింపును బయటపెట్టట్లేదా? అలాగని ఇకనుంచి వారిని నంబర్లతో పిలుస్తారా?" అని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే, తరగతి గదుల్లో ముఖం పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను అనుమతించకూడదని కోర్టు స్పష్టం చేసింది. క్యాంపస్‌లో ఎలాంటి మతపరమైన కార్యకలాపాలకు అనుమతి లేదని తెలిపింది. ఈ మధ్యంతర ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే.. సదరు విద్యా సంస్థ కోర్టుకు వెళ్లేందుకు స్వేచ్ఛ కల్పించింది. అనంతరం దీనిపై కాలేజీకి నోటీసులు జారీ చేసింది. నవంబరు 18లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు

ముందడుగు వెంకటాపూర్

వెంకటాపూర్ మండలంలోని మల్లయ్యపల్లి, నల్లగుంట గ్రామాల్లో శుక్రవారం వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్, ఎక్సైజ్ ఎస్ఐ లింగా గౌడ్ లు తమ సిబ్బందితో కలిసి గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న 750 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగహన సదస్సులో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. గుడుంబా తయారు చేయటం, అమ్మడం చట్టరీత్యా నేరమని, అదేవిధంగా గ్రామాల్లో గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయాలు జరిపిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాల్లోకి వస్తాను..

### అవామీ లీగ్ పార్టీని కాపాడుకుంటాను
### షేక్ హసీనా తనయుడు సాజీబ్ ప్రకటన

ముందడుగు డెస్క్

బంగ్లాదేశ్‌లో హింసాకాండ అక్కడి రాజకీయ పరిస్థితులను ఒక్కసారిగా మార్చేసింది. షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం కూలిపోయి, చివరకు ఆమె భారత్‌లో ఆశ్రయం పొందాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో తాను తన తల్లి వారసత్వాన్ని అందిపుచ్చుకుంటానని సాజీబ్ వాజెద్ ప్రకటించారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధమని తెలిపారు. గతంలో తనకు అలాంటి ఉద్దేశమే లేదని, అయితే అవామీ లీగ్ పార్టీ నేతలపై దాడుల నేపథ్యంలో ఆ పార్టీని రక్షించుకునేందుకు తాను ఏం చేయడానికైనా వెనకడుగు వేయనని స్పష్టంచేశారు. రాజకీయాల్లో చేరాల్సిన అవసరం ఉందనుకుంటే.. నేను వెనక్కి తగ్గను. ఈసారి పదవీకాలం పూర్తయిన తర్వాత మా అమ్మ రాజకీయాల నుంచి రిటైర్ అయ్యేవారు. నాకు రాజకీయంగా ఎలాంటి ఆశయాలు లేవు. నేను ఎప్పుడో అమెరికాలో సెటిల్ అయ్యాను. కానీ ప్రస్తుత బంగ్లా పరిణామాల వేళ.. నాయకత్వ లోటు కనిపిస్తోంది. అవామీ లీగ్ పార్టీ, నేతల కోసం నేను చురుగ్గా వ్యవహరిస్తున్నాను" అని వాజెద్ వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో అవామీ



లీగ్ పోటీ చేసి, గెలుపొందుతుందన్న నమ్మకంతో ఉన్నానన్నారు. " మా అమ్మ ఏ దేశాన్ని ఆశ్రయం కోరాలని అనుకోవడం లేదు. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఉన్నారు. తాత్కాలిక ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన తర్వాత ఆమె మళ్లీ అక్కడికే వెళ్తారు. నా తల్లికి రక్షణ కల్పించిన భారత ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు" అని అన్నారు.

ముందడుగు
శనివారం, 10-08-2024, హైదరాబాద్



# రష్యా సైన్యంలో 69మంది భారతీయులు

## వారిని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు
## లోక్‌సభలో ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

ముందడుగు జాతీయం

రష్యా సైన్యంలో భారతీయులు మొత్తం 91 మంది ఉన్నారు. అందులో ఎనిమిది మంది మృతి చెందగా.. 14 మంది తిరిగి స్వదేశానికి వచ్చారు. మిగిలిన 69 మందిని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈవిషయమై స్వయంగా రష్యా విదేశాంగశాఖ మంత్రితో మాట్లాడాను. ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి మోదీ సైతం ఇదే విషయాన్ని ప్రస్తావించారు. భారత పౌరులు రష్యా సైన్యంలో సేవలందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అదే పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వం సైతం ఆ ఒప్పందాలకు కట్టుబడి ఉండాల్సివస్తుంది. వేరే పనికోసం వెళ్లిన పౌరులు రష్యా సైన్యంలో ఇరుక్కున్నారని మేము భావిస్తున్నాం. రష్యా సైన్యంలో ఉన్న భారతీయులు ఎవరినైనా తిరిగి స్వదేశానికి పంపించేందుకు కృషి చేస్తానని ఆ దేశ అధ్యక్షుడు హామీ ఇచ్చారు' అని జై శంకర్ తెలిపారు.

# ఒలింపిక్స్‌లో మహిళను వేధించిన రెజ్లర్

## అరెస్ట్ చేసిన ఫ్రెంచ్ పోలీసులు

ముందడుగు డెస్క్



ఒలింపిక్స్‌లో పాల్గొనడం, పతకం సాధించడం చాలా మంది క్రీడాకారుల జీవితలక్ష్యంగా ఉంటుంది. విశ్వక్రీడల్లో సత్తా చాటేందుకు ఎంతోమంది క్రీడాకారులు అహర్నిశలు కష్టపడుతూనే ఉంటారు. టోర్నీ సమయంలో పతకమే లక్ష్యంగా అవిశ్రాంతంగా సాధన చేస్తారు. కానీ, ఇందుకు భిన్నంగా మహిళ పట్ల సభ్యంగా ప్రవర్తించిన ఓ రెజ్లర్‌ను ఫ్రెంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒలింపిక్స్ నిర్వహకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఈజిప్టు రెజ్లర్ ముహమ్మద్ అల్-సయ్యద్ గురువారం అర్ధరాత్రి తాగిన మత్తులో ఓ మహిళను అసభ్యంగా తాకినట్లుగా ఆరోపణలు వచ్చాయి. దీంతో శుక్రవారం తెల్లవారుజామున అతడిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జరిగిన 67 కేజీల గ్రీకో-రోమన్ రెజ్లింగ్‌లో ముహమ్మద్ అల్-సయ్యద్ అజర్‌బైజాన్ దేశానికి చెందిన హస్రత్ జఫరోవ్ చేతిలో ఓడిపోయాడు. అరెస్టయిన అతడిని విడుదల చేసే అంశంపై ఇంకా స్పష్టత రాలేదని నిర్వాహకులు తెలిపారు. కాగా.. 2021లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో అల్-సయ్యద్ కాంస్యం సాధించాడు.

# పాఠశాలల్లో గుడ్‌మార్నింగ్ బదులు జైహింద్

ముందడుగు హరియాణా

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హరియాణా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు టీచర్లకు, తోటి స్నేహితులకు పలకరింపుగా 'గుడ్ మార్నింగ్'కు బదులుగా 'జై హింద్' అని చెప్పాలని పాఠశాల విద్యా డైరెక్టరేట్ నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల్లో చిన్ననాటినుంచే దేశభక్తి, దేశంపై గౌరవం, ఐక్యతా భావాలను పెంపొందించాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయజెండాను ఎగురవేసే ముందు నుంచి ఈ సూచనలను అమలుచేయనున్నట్లు వెల్లడించారు.

# ప్రత్యేకమైన డిస్‌ప్లే సెంటర్ ప్రారంభించిన గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్



ముందడుగు హైదరాబాద్

సర్ఫేసింగ్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్, హైదరాబాద్‌లోని స్పెలక్స్ (మెసర్స్ శ్రీ సాయి ప్లైవుడ్ ఎల్ఎల్‌పి యూనిట్)లో తన ఫ్లాగ్‌షిప్ బ్రాండ్‌ల కోసం ప్రత్యేకమైన డిస్‌ప్లే సెంటర్‌ను ప్రారంభించింది. అఘాపురా, జ్ఞాన్ బాగ్ కాలనీ, గోషామహల్, నాంపల్లి సమీపంలోని పాన్ మండి రోడ్‌లో ఉన్న ఈ షోరూమ్‌లో మికాసా ఫ్లోర్స్, న్యూమికా లామినేట్స్ మరియు మికాసాప్లైతో పాటు డెకోవుడ్ వెనియర్స్ అద్భుతమైన కలెక్షన్లు ప్రముఖంగా ప్రదర్శించారు. నగరంలో ఇంతటి వైవిధ్యమైన ప్రీమియం సర్ఫేసింగ్ ఉత్పత్తులను ఒకే పైకప్పు క్రింద అందిస్తున్న మొదటి స్టోర్ ఇది. దీన్ని ప్రారంభించిన సందర్భంలో గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ పరుల్ మిట్టల్ మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో మా ప్రత్యేకమైన డిస్‌ప్లే సెంటర్‌ను ఆవిష్కరిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. ఇక్కడ మేము గ్రీన్‌లామ్ అత్యుత్తమ ఉత్పత్తులను సగర్వంగా ప్రదర్శిస్తాము. షోరూమ్‌లో మికాసా రియల్ వుడ్ ఫ్లోర్స్, డికోవుడ్ వెనీర్స్, న్యూమికా లామినేట్స్ మరియు మా ప్లైవుడ్ బ్రాండ్ మికాసాప్లై ఉన్నాయి. మా రిటైల్ ఫుట్‌ప్రింట్‌ను విస్తరించాలనే మా నిబద్ధతలో భాగంగా, ఈ కేంద్రం ఏదైనా స్థలాన్ని మార్చడానికి సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుందని ఆమె తెలిపారు.

# ఫోన్‌పే నుండి ప్రీ-అప్రూవ్డ్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్

ముందడుగు హైదరాబాద్


ఫోన్‌పే తన ప్లాట్‌ఫామ్‌లో 'ప్రీ-అప్రూవ్డ్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్' ఫీచర్‌ను ఈరోజు తీసుకొచ్చింది. పాలసీ కొనుగోలు సమయంలో ఇన్‌కమ్ ప్రూఫ్ అవసరమనే నిబంధనను ఎత్తివేయడం ద్వారా లక్షలాది మంది భారతీయులు ఇన్సూరెన్స్ కవరేజీని తేలిగ్గా అందుకునే సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా, భారతీయుల్లో చాలా మందికి ఆర్థికంగా సమాన అవకాశాలు కల్పించే కొత్త శకానికి ఫోన్‌పే నాంది పలికింది. ఈ ఆవిష్కరణ గురించి ఫోన్‌పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసుల సిఈఓ విశాల్ గుప్తా మాట్లాడుతూ, "ముందుగా ఆమోదించిన ఇన్సూరెన్స్ కింద హామీ మొత్తం అనే అర్థం వచ్చే ప్రీ-అప్రూవ్డ్ సమ్ ఇన్సూర్డ్ ఫీచర్‌ను ప్రారంభించినందుకు చాలా సంతోషంగా ఉంది. గతంలో ఈ సర్వీస్‌ను పొందలేని ఎంతోమంది కస్టమర్లను టర్మ్ ఇన్సూరెన్స్ ఒడిలోకి తీసుకురావడమే లక్ష్యంగా దీన్ని ప్రారంభించాము. వివిధ సామాజిక-ఆర్థిక పరిస్థితులకు చెందిన భారతీయులు దీన్ని పొందేలా, వారికి అందుబాటు ధరలో తీసుకురావడంపై దృష్టి పెట్టాం అన్నారు.

PhonePe

ముందడుగు
శనివారం,
10-08-2024,
హైదరాబాద్

## సుప్రీంకోర్టులో ప్రదర్శించిన బాలీవుడ్ చిత్రం లాపతా లేడీస్

### ప్రధాన న్యాయమూర్తితో పాటు, అమీర్ ఖాన్ హాజరు




**ముందడుగు జాతీయం**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'ను ప్రదర్శించారు. సాయంత్రం 4.15 గంటల నుంచి ఈ సినిమా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్, ఆ చిత్ర దర్శకురాలు కిరణ్ రావ్ ఆ సినిమాను వీక్షించేందుకు సుప్రీంకోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమిర్ వస్తున్నట్లు ప్రకటించిన సందర్భంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సరదా వ్యాఖ్యలు చేశారు. "కోర్టులో తొక్కిసలాట తరహా పరిస్థితిని నేను కోరుకోను. కానీ ఈరోజు ఇక్కడ ఆమిర్ ఉన్నారు.." అంటూ చమత్కరించారు. ఈ సినిమాను సీజేఐ, ఇతర న్యాయమూర్తులు, వారి కుటుంబాలు, ఇతర సిబ్బంది వీక్షిస్తున్నారు. తన చిత్రాలతో సామాజిక అంశాలను లేవనెత్తే ఆమిర్ సొంత బ్యానర్‌పై 'లాపతా లేడీస్ తెరకెక్కిన విషయం తెలిసిందే.



## ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ యాక్షన్ డ్రామా షురూ

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్, కేజీఎఫ్ ఫేమ్ దర్శకుడు ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న పాన్ ఇండియా యాక్షన్ మూవీ శుక్రవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. మే నెలలోనే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. అప్పటి నుంచి ఈ సినిమా లాంచ్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్ని ఉన్నాయని, వాటన్నింటిని అందుకునేలా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నామని, ఎన్టీఆర్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: భువన్‌గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైన్: చలపతి, నిర్మాతలు: నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, రచన-దర్శకత్వం: ప్రశాంత్‌నీల్.

## సింగిల్ అని ఎప్పుడైనా చెప్పానా?

కథానాయికలు వారి రిలేషన్‌షిప్ గురించి చెప్పడానికి అంతగా ఇష్టపడరు. ఏదైనా ఇంటర్వ్యూలో అలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు సాధ్యమైనంత వరకు దాటవేసే ప్రయత్నం చేస్తారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అగ్ర కథానాయిక కీర్తి సురేష్ తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి పరోక్షంగా తన మనసులోని మాటను బయటపెట్టింది. ఇన్నేళ్లు సింగిల్‌గా ఉంటున్నారు. మీకస్సలు బోర్‌గా అనిపించడం లేదా? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు..'నేను సింగిల్‌గా ఉన్నానని మీతో ఎప్పుడైనా చెప్పానా? అంటూ ఎదురు ప్రశ్నించింది. దాంతో ఈ భామ ప్రేమలో ఉందనే నిర్ధారణకు వచ్చారు అభిమానులు. అదే విషయాన్ని పరోక్షంగా చెప్పిందని అనుకుంటున్నారు. కీర్తి సురేష్ వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ముద్దుగుమ్మ మనసుదోచిన కుర్రాడెవరంటూ ఆమె అభిమానులు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఇదే ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి కూడా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది కీర్తి సురేష్. కెరీర్ ఆరంభంలో వరుస ఫెయిల్యూర్స్‌తో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, 'మహానటి' చిత్రం తర్వాతే అద్భుతమైన విజయాలు వరించాయని చెప్పింది. కీర్తి సురేష్ తాజా తమిళ చిత్రం 'రఘు తాత' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది.

